


- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించిన పోలీస్ క్రీడాకారులకు అభినందన సభ

## మరింత శ్రమిస్తే జాతీయ స్థాయిలో రాణించగలం



## బడ్జెట్‌పై కేబినెట్ కసరత్తు

- 28న పద్దు ప్రవేశపెట్టే అవకాశం
- సీఎం అధ్యక్షతన మంత్రి మండలి భేటీ
- రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేయాలని నిర్ణయం
- ప్రాదేశిక ఎన్నికలపై చర్చ జరిగినప్పటికీ.. ఏ నిర్ణయానికీ రాలేదు
- మే నుంచి జనగణన చేపట్టేందుకు సుదీర్ఘమైన చర్చ

05

సంపుటి :02 | సంచిక :314 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

సోమవారం 23, ఫిబ్రవరి 2026



## కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్

- సహనాన్ని బలహీనతగా తీసుకోవద్దు
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

05

- ఇప్పటికే లొంగిపోయిన పార్టీ సుప్రీం కమాండర్ దేవ్‌జీ
- ఆయనతోపాటు అగ్రనేత రాజిరెడ్డి కూడా..
- కేంద్ర కమిటీలో ఇక మిగిలింది ఇద్దరే
- ఒకరు గణపతి.. మరొకరు బెస్రా.. ఇద్దరూ వృద్ధులే
- తీవ్రమైన అనారోగ్య సమస్యల్లో నేతలు
- పార్టీలో మిగిలింది 300 మంది మాత్రమే.. వారి లొంగుబాటు అనివార్యమే



# నక్సల్స్ ప్రస్థానం ఆఖరి ఘట్టం

### మరికొద్ది రోజుల్లో మావోయిస్టు పార్టీ అస్తమయం

50 ఏళ్లకు పైగా సాగిన మావోయిస్టుల ప్రస్థానం ఇక అస్తమయానికి చేరువైంది. ఒకప్పుడు 16 రాష్ట్రాల్లో రెడ్ కారిడార్‌గా ప్రాబల్యం ఉన్న పార్టీ ఇప్పుడు దాదాపు అంతర్థానమయ్యే స్థితిలోకి వచ్చింది. ఎన్నో పరాభావాలు, ఎన్నో ఎన్‌కౌంటర్లు, పదుల సంఖ్యలో అగ్రనేతల మరణాల తర్వాత పార్టీ పూర్తిగా బలహీన పడింది. గతేడాది పార్టీ సుప్రీం కమాండర్ బసవరాజు కూడా ఎన్‌కౌంటర్ లో మరణించారు. కేంద్ర ప్రభుత్వం వచ్చే నెల 31లోపు భారత్‌ను నక్సల్ విముక్త దేశం చేస్తా మని ప్రతిన బూనింది. అందుకు అనుగుణంగానే పావులు కదుపుతున్నది. దీనిలో భాగంగానే అగ్రనేతలు టార్గెట్ గా దండకారణ్యంతోపాటు తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టలను జల్లెడ పడుతున్నది. ఈ క్రమంలో ఆదివారం అనూహ్యమైన పరిణామం చోటుచేసుకున్నది. మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, సెంట్రల్ కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఆదివారం పోలీసుల ముందు లొంగిపోయారు. ఇప్పుడు మిగిలిన పార్టీ కేడర్ పరిస్థితి ఏంటనే ప్రశ్న తలెత్తుతున్నది. – అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

02



## పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఉన్నత స్థాయి సమీక్ష
- గోదావరి పుష్కరాలు-2027పై జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం
- కాళేశ్వరానికి రానున్న లక్షలాది భక్తులు.. భద్రత, వసతులపై ప్రత్యేక దృష్టి

02



## ఉద్యమకారులకు హైకోర్టు శుభవార్త

- 8 వారాల్లోగా స్థలాలు కేటాయించాలని హైకోర్టు ఆదేశం
- నెలకు రూ.25 వేల పెన్షన్ ఇవ్వాల్సిందేనని స్పష్టీకరణ
- హామీల అమలుపై నిర్లక్ష్యం వహించవద్దని ప్రభుత్వానికి హెచ్చరిక

05

# నక్సల్స్ ప్రస్థానం ఆఖరి ఘట్టం

- మరికొద్ది రోజుల్లో మావోయిస్టు పార్టీ అస్తమయం
- ఇప్పటికే లొంగిపోయిన పార్టీ సుప్రీం కమాండర్ దేవ్‌జీ
- ఆయనతోపాటు అగ్రనేత రాజిరెడ్డి కూడా..
- కేంద్ర కమిటీలో ఇక మిగిలింది ఇద్దరే
- ఒకరు గణపతి.. మరొకరు బెస్రా.. ఇద్దరూ వృద్ధులే
- తీవ్రమైన అనారోగ్య సమస్యల్లో నేతలు
- పార్టీలో మిగిలింది 300 మంది మాత్రమే.. వారి లొంగుబాటు అనివార్యమే

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

50 ఏళ్లకు పైగా సాగిన మావోయిస్టుల ప్రస్థానం ఇక అస్తమయానికి చేరువైంది. ఒకప్పుడు 16 రాష్ట్రాల్లో రెడ్ కారిడార్‌గా ప్రాబల్యం ఉన్న పార్టీ ఇప్పుడు దాదాపు అంతర్థానమయ్యే స్థితిలోకి వచ్చింది. ఎన్నో పరాభావాలు, ఎన్నో ఎన్‌కౌంటర్లు, పదుల సంఖ్యలో అగ్రనేతల మరణాల తర్వాత పార్టీ పూర్తిగా బలహీన పడింది. గతేడాది పార్టీ సుప్రీం కమాండర్ బసవరాజు కూడా ఎన్‌కౌంటర్ లో మరణించారు. కేంద్ర ప్రభుత్వం వచ్చే నెల 31లోపు భారత్‌ను నక్సల్ విముక్త దేశం చేస్తామని ప్రతిన బూనింది. అందుకు అనుగుణంగానే పావులు కదుపుతున్నది. దీనిలో భాగంగానే అగ్రనేతలు టార్గెట్ గా దండకారణ్యంతోపాటు తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టలను జల్లెడ పడుతున్నది. ఈ క్రమంలో ఆదివారం అనూహ్యమైన పరిణామం



చోటుచేసుకున్నది. మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జి, సెంట్రల్ కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఆదివారం పోలీసుల ముందు లొంగిపోయారు. ఇప్పుడు మిగిలిన పార్టీ కేడర్ పరిస్థితి ఏంటనే ప్రశ్న తలెత్తుతున్నది.

### - ప్రాణాల నిలుపుకోవడమే పెద్ద సవాల్

భౌగోళికంగా కీలకమైన అబుజ్‌మాడ్, దక్షిణ బస్తర్ ప్రాంతాల్లో సైతం ఇప్పుడు బలగాల గాలింపు ముమ్మరమైంది. ఐఈడీల ముప్పు ఉన్నప్పటికీ అత్యాధునిక సాంకేతికతతో కూడిన నిఘా వ్యవస్థ మావోయిస్టుల ఉనికిని కష్టతరం చేస్తోంది. ఒకప్పుడు పార్టీకి పెట్టని కోటలుగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు రోడ్లు, సెల్ టవర్లు ఏర్పాటు కావడంతో గెరిల్లా వ్యూహాలు ఫలించడం లేదు. స్థానిక ఆదివాసీల మద్దతు క్రమంగా తగ్గడం కూడా పార్టీ బలహీనపడటానికి ప్రధాన కారణమైంది. యువత విప్లవ బాట కంటే అభివృద్ధి వైపు ఆకర్షితులవుతుండటంతో పార్టీకి కొత్త రిక్రూట్‌మెంట్లు ఆగిపోయాయి. మార్చి 31 నాటికి పార్టీ ఉనికిని కాపాడుకోవడం మిగిలిన నేతలకు పెద్ద సవాలుగా మారింది.

### - మరో 36 రోజులే గడువు

కేంద్ర ప్రభుత్వం విధించిన మార్చి 31 గడువు మరో 36 రోజుల్లో ముగియనుంది. ఈ లోపే నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని భద్రతా దళాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కేవలం 300 మంది మావోయిస్టులు మాత్రమే మిగిలి ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2025లో ఇప్పటికే 10 మంది సెంట్రల్ కమిటీ సభ్యులు హతమవ్వడం లేదా లొంగిపోవడం జరిగింది. తాజాగా దేవ్‌జి, రాజిరెడ్డి నిష్క్రమణతో పార్టీ నాయకత్వం కోలుకోలేని విధంగా దెబ్బతిన్నది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీలో ఇద్దరు మాత్రమే మిగిలారు. వారిలో ఒకరు మిసిర్ బెస్రా అలియాస్ భాస్కర్ కాగా, మరొకరు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి. వారు ప్రస్తుతం తీవ్రమైన వయోభార సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారు ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకునే పరిస్థితిలో లేరు. వీరు కూడా అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం. వీరు కాకుండా కీలక నేతలు పదుల సంఖ్యలో ఉంటారని, వారు కూడా భద్రతా దళాల వలయంలో చిక్కుకుని బయటకు రాలేకపోతున్నారని తెలుస్తున్నది.

### - లొంగిపోవడమే శరణ్యం

సుదీర్ఘ కాలం పాటు పోరాడిన నాయకులే లొంగిపోతుండటంతో మిగిలిన క్యాడర్ కూడా ఇదే బాట పట్టే అవకాశం ఉంది. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో మావోయిస్టు పార్టీ నామమాత్రంగానే మిగిలిపోయింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక దాడులు అటు అగ్రనేతలను, ఇటు ఆర్థిక మూలాలను దెబ్బతీశాయి. దండకారణ్యంలో ముంచుకొస్తున్న ఈ పరిణామాలు భారత విప్లవ చరిత్రలో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగింపునకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. అగ్రనేతల వరుస లొంగుబాట్లు సామాన్య క్యాడర్ మనోధైర్యాన్ని పూర్తిగా కుంగదీస్తున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న 300 మంది సభ్యులు ఇప్పుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. ప్రభుత్వ పునరావాస పథకాల వైపు మళ్ళాలా లేక పోరాటం కొనసాగించాలా అన్న సందిగ్ధంలో వారు కొట్టుమిట్టాడుతున్నారు. సీఆర్పీఎఫ్, ప్రత్యేక బెటాలియన్లు, ఛత్తీస్‌గఢ్ డీఆర్జీ బలగాలు అడవిని జల్లెడ పడుతున్నాయి. బలగాల ఉధృతికి మావోయిస్టు పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. తమ ప్రాణాలతో పాటు క్యాడర్‌ను కాపాడుకునేందుకు అగ్రనేతలు లొంగిపోవడమే మార్గమని భావిస్తున్నారు.



## పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఉన్నత స్థాయి సమీక్ష
- గోదావరి పుష్కరాలు- 2027పై జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం
- కాళేశ్వరానికి రానున్న లక్షలాది భక్తులు.. భద్రత, వసతులపై ప్రత్యేక దృష్టి

అక్షరదర్బార్, భూపాలపల్లి : రాబోయే 2027 గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు ప్రభుత్వం ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ సోమవారం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పుష్కరాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన సమగ్ర ఏర్పాట్లపై ఆమె అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేయాలని ఆదేశించారు. పర్మనెంట్ పుష్కర ఘాట్లతో పాటు తాత్కాలిక స్నాన ఘాట్లను సిద్ధం చేయాలి. వీఐపీ ఘాట్ల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. నిరంతర తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య శిబిరాల ఏర్పాటు వంటి అంశాల్లో నిర్లక్ష్యం వహించకూడదని అన్నారు.

### - ట్రాఫిక్, భద్రతపై నిఘా

పుణ్యక్షేత్రమైన కాళేశ్వరానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పార్కింగ్ స్థలాల గుర్తింపు, సీసీ కెమెరాల ఏర్పాటు, పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఉండాలని ఆదేశించారు. భక్తులకు క్యూలైన్ల నిర్వహణ, దర్శన వ్యవస్థపై అవసరమైన సమాచారాన్ని నిరంతరం అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

### - సమన్వయంతో ముందుకు సాగుతాం

ఐడీఓసీ కార్యాలయం నుండి ఈ సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లాలో చేపట్టబోయే పనుల వివరాలను వివరించారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో పుష్కరాలను విజయవంతం చేసేందుకు కట్టుదిట్టమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మితో పాటు ఇరిగేషన్, వైద్య, సమాచార, మిషన్ భగీరథ, దేవాదాయ, పంచాయతీ రాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 44 దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖలకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. దరఖాస్తులను జాప్యం లేకుండా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వచ్చే ప్రజావాణి నాటికి అందిన ప్రతి వినతిని పూర్తిగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి కార్యాలయానికి వస్తున్నందున అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కేయూలో 'చికెన్' చిచ్చు

### - ఎంబీఏ, ఎకనామిక్స్ విద్యార్థుల మధ్య ఘర్షణ

అక్షరదర్బార్, హనుమకొండ : ప్రతిష్టాత్మక కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)లో విద్యార్థుల మధ్య జరిగిన గొడవ కలకలం రేపింది. కేవలం 'చికెన్' పంపకాల విషయంలో మొదలైన చిన్న వివాదం కాస్తా, రెండు గ్రూపుల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన క్యాంపస్‌లో చర్చనీయాంశంగా మారింది. విశ్వవిద్యాలయ హాస్టల్‌లో భోజన సమయంలో ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు, ఎకనామిక్స్ మొదటి సంవత్సరం విద్యార్థులకు మధ్య వివాదం మొదలైంది. చికెన్ వడ్డన విషయంలో తలెత్తిన చిన్నపాటి తేడాతో ఇరు వర్గాల విద్యార్థులు పరస్పరం వాదించుకున్నారు.

### - మాట మాట పెరిగి.. దాడుల వరకు

ప్రారంభంలో మామూలుగా మొదలైన ఈ వాగ్వాదం క్షణాల్లో ముదిరిపోయింది. ఒకరినొకరు దూషించుకోవడంతో ఆగకుండా, ఇరు వర్గాల విద్యార్థులు ఒకరిపై ఒకరు భౌతిక దాడులకు దిగారు. ఈ ఘర్షణలో కొంతమంది విద్యార్థులకు




స్వల్ప గాయాలైనట్లు సమాచారం. గొడవ పెద్దది కావడంతో తోటి విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది జోక్యం చేసుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

### - యూనివర్సిటీలో టెన్షన్..

విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన క్యాంపస్‌లో చిన్న కారణానికే విద్యార్థులు ఇలా దాడులకు దిగడంపై అధ్యాపకులు, తోటి విద్యార్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై యూనివర్సిటీ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. క్యాంపస్‌లో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## చైర్మన్ కు శుభాకాంక్షలు

అక్షరదర్బార్, భూపాలపల్లి: నూతనంగా భూపాలపల్లి మున్సిపాలిటీ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన బుర్ర కొమురయ్య గౌడ్ ను సోమవారం జాతీయ యువజన అవార్డు గ్రహీత వేణుగోపాల్, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ భువన సుందర్, స్థానికులు వెంకటస్వామి, లింగారావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఇచ్చిన మాట నిలబెట్టుకునేదే ఇందిరమ్మ ప్రభుత్వం

## నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

అక్షర దర్బార్, నర్సంపేట: ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముందుండేదే ఇందిరమ్మ ప్రభుత్వమని నర్సంపేట దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం ఖానాపురం మండలం అయోధ్యనగర్, పర్శనాయక్ తండాలలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల ఆత్మగౌరవం, భరోసా, భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తొలి సంవత్సరంలోనే రూ.22,500 కోట్ల వ్యయంతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు కేటాయించినట్లు తెలిపారు. నర్సంపేట నియోజకవర్గానికి మరిన్ని ఇండ్లు మంజూరు చేయాలని సీఎం ను కోరినట్లు పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో ఇదే వేగంతో అభివృద్ధి కొనసాగిస్తూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## డీఫ్లోరైడ్ ప్రాజెక్టుపై సమీక్ష

నర్సంపేట పట్టణంలోని అశోక్ నగర్ డీఫ్లోరైడ్ ప్రాజెక్టుపై సోమవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధ్యక్షత వహించగా, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డీఫ్లోరైడ్ ప్రాజెక్టు పునరుద్ధరణకు సుమారు రూ.12 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు నిధులు అవసరమని, ఇప్పటికే నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరు చేయించి ప్రాజెక్టును పునరుద్ధరించి నర్సంపేట తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రాజెక్టుకు కేటాయించిన భూమి అక్రమాలకు గురికాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా దూప సముద్రం చెరువు మరియు ఎగువ అటవీ ప్రాంతాల వర్షపు నీటిని కాలువల ద్వారా ప్రాజెక్టులోకి మళ్లించి నీటి సామర్థ్యాన్ని పెంచే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు.

# యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సేవలు అభినందనీయం

## సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ అందిస్తున్న సేవలు అభినందనీయమని గాంధీనగర్ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న అన్నారు.  గోవిందరావుపేట మండలం గాంధీనగర్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ పాఠశాలకు మరమ్మతులు చేయడం, డెస్క్–బెంచీలు, కుర్చీలు అందించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గ్రామస్తులకు శుద్ధజలాల కోసం బోర్‌వెల్ ఏర్పాటు చేసి, షెడ్ నిర్మాణం చేపట్టడం ప్రశంసనీయమన్నారు. త్వరలోనే వాటర్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు. నిరుపేద వితంతు మహిళలకు స్వయం ఉపాధి కోసం సహాయం చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. గ్రామాన్ని దత్తత తీసుకుని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సంస్థ ప్రతినిధులు గ్రామాభివృద్ధికి తమ సహకారం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వల్లపు మహేష్, గ్రామ కార్యదర్శి భారతి, వార్డు సభ్యులు, లాకావత్ ఈర్య, మాలోత్ శంకర్, లిక్కి కుమారస్వామి, హెచ్ఎం లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

## స్వేరోస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మంద శ్యామ్

అక్షర దర్బార్, దుగ్గొండి: విద్యార్థినిలు ఆత్మవిశ్వాసంతో జీవితంలో ముందుకు సాగాలని, పరీక్షల ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని స్వేరోస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మంద శ్యామ్ సూచించారు. దుగ్గొండి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కష్టపడి చదువుకుంటేనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, లక్ష్యసాధనలో ఏకాగ్రత ముఖ్యమని తెలిపారు. పరీక్షల సమయంలో భయం, ఆందోళనలకు లోనుకాకుండా సమయపాలనతో సిద్ధమవ్వాలని సూచించారు. స్వేరోస్ జిల్లా నాయకులు కూడా విద్యార్థినిలకు ఉత్తేజకర సందేశాలు అందించారు.






# ముస్త్యాలపల్లిలో ఉచిత వైద్య శిబిరం

## అజరా హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య సేవలు

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో సర్పంచ్  మేకమల్ల వెంకటేష్ సౌజన్యంతో వరంగల్‌కు చెందిన అజరా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్య పరీక్షలు, రక్తపోటు–చక్కెర స్థాయిల పరీక్షలు, సాధారణ రోగాల నిర్ధారణ చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలు పొందారు. వైద్యులు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ, శుభ్రత–పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. తీవ్రమైన వ్యాధుల లక్షణాలు గమనించిన వారికి తదుపరి చికిత్స కోసం ఆసుపత్రికి రావాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, యువకులు శిబిరం నిర్వహణలో సహకరించారు.

# గ్రామాభివృద్ధి కోసం తపిస్తున్న యువ సర్పంచ్

## ఆదర్శంగా నిలుస్తున్న సనత్ కుమార్



అక్షరదర్బార్, పరకాల: పరకాల మండలం అలియాబాద్ గ్రామ సర్పంచ్ శాతరాశి సనత్‌కుమార్ పటేల్ గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు నమ్మకంతో తనను సర్పంచ్‌గా గెలిపించారని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా నిత్యం గ్రామంలోనే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.గ్రామంలో సైడ్ డ్రైనేజీలు మురుగుతో నిండిపోవడంతో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ పక్క గ్రామాల నుంచి కార్మికులను తీసుకువచ్చి శుభ్రపరిచే చర్యలు చేపట్టారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని స్థానిక దాత సహకారంతో పునరుద్ధరించి కొత్త రూపు తీసుకువచ్చారు. పాఠశాల విద్యార్థులకు తాగునీటి కోసం ప్రత్యేక వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేయడంతో పాటు గ్రామస్తుల వినియోగానికి ఉన్న మంచినీటి ట్యాంకులను శుభ్రపరచించారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న సర్పంచ్‌గా ఆయన గుర్తింపు పొందుతున్నారు. గ్రామంలో వర్షపు నీరు నిల్వ ఉండేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ప్రజలను అవగాహన కల్పిస్తున్నారు. అలియాబాద్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తానని సర్పంచ్ సనత్‌కుమార్ పటేల్ తెలిపారు.

# వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల్లో వార్డు మెంబర్లకు పంచాయతీ పరిపాలనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఫణిచంద్ర తెలిపారు. ఫిబ్రవరి 24 నుంచి ఫిబ్రవరి 28 వరకు ప్రతిరోజూ ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించబడతాయని చెప్పారు. శాయంపేట–మైలారం రోడ్డులోని రైతు వేదికలో ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. పరిపాలనా బాధ్యతలపై అవగాహన పెంపొందించుకునేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని ఎంపీడీవో తెలిపారు.

# 25న జాబ్ మేళా..

అక్షర దర్బార్, మహబూబాబాద్: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 25న నిరుద్యోగుల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఖాళీగా ఉన్న వివిధ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై, 20 నుంచి 32 ఏళ్ల లోపు వయసున్న అభ్యర్థులు (ఫ్రెషర్స్ లేదా అనుభవం ఉన్నవారు) ఈ మేళాకు హాజరుకావచ్చు. ఎంపికైన వారికి నెలకు రూ. 17,000 నుంచి రూ. 50,000 వరకు వేతనంతో పాటు ఇన్సెంటివ్స్, టీఏ, డీఏ మరియు రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ కవరేజ్ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల పత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ నెల 25న ఉదయం 10:30 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో ఉన్న ఉపాధి కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు.



### ఉద్యమ కారులను ఆదుకుంటామనే
# ప్రకటన హర్షనీయం
### సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు కృతజ్ఞతలు

అక్షర దర్బార్, మల్హర్: ఉద్యమ కారుల హామీలను నెరవే ర్చేందుకు ఈ నెలాఖరులోగా సబ్ కమిటీ ఏర్పాటు చేయ నున్నట్లు నిజామాబాద్‌లో జరిగిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేసిన ప్రకటన హర్షనీయమని టీయూఎఫ్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలోజు సత్యనారాయణ, జిల్లా నాయకులు పేర్కొన్నారు. సోమవారం తాడిచెర్లలో నిర్వ హించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమ కారులకు ఇచ్చిన హామీ అమలుకు ప్రభుత్వం ముందుకు రావడం ఆనందదాయకమన్నారు. టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ నాయక త్వంలో గత ఎనిమిదేళ్లుగా చేసిన పోరాటాలకు ఇది ఫలిత మని తెలిపారు. సబ్ కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, కేబినెట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టియూఎఫ్ మండల అధ్యక్షులు బూడిద సతీష్, ఉద్యమ కారులు బడితల వెంకటస్వామి, చొప్పరి రాజు, షేక్ చాంద్ పాష, కోండ్ర సారయ్య, ఆకుల రాజేశం, ఆకుల సదానందం, మద్దుల విజయ, జునగరి పద్మ, సమ్మయ్య, రవి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'నర్సంపేట గర్ల్స్ హైస్కూల్లో మూత్రశాలలు నిర్మించాలి'

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్‌లో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని ఏఐఎఫ్‌డీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు జన్ను రమేష్, కార్యదర్శి చుక్క ప్రశాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. పాఠశాలలో సరైన మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం లేక పోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సరిపడా తరగతి గదులు లేకపోవడంతో కొంతమంది విద్యార్థులు చెట్ల కింద కూర్చొని చదువుకుం టున్నారని చెప్పారు. ఉన్న గదుల్లో ఫ్యాన్లు సరిగా పనిచే యడం లేదని పేర్కొన్నారు. 7వ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ కూడా నిరుపయోగంగా ఉందని విమర్శించారు. తక్షణమే సంబంధిత అధికారులు, ప్రజాప్ర తినిధులు స్పందించి మూత్రశాలలు నిర్మించడం, తాగునీటి సదుపాయం కల్పించడం, అదనపు తరగతి గదులు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో విద్యార్థులు వరుణ్ తేజ్, తరుణ్, వర్షిత్, జాను, పల్లవి, అఖిల, మానస తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎస్‌టీ వీడియో గ్రాఫర్లకు బకాయిలు చెల్లించాలి



అక్షరదర్బార్, పరకాల: పరకాల నియోజకవర్గంలో గత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఎఫ్ఎస్‌టీ (ఫ్లయింగ్ స్క్వాడ్ టీం) టీంలో వీడియో గ్రాఫర్లుగా పనిచేసిన వారికి ఇప్పటికీ పారితోషికం అందలేదని బాధితులు వాపోతున్నారు. ఫస్ట్, సెకండ్ షిఫ్టుల్లో నిద్రాహారాలు మానుకొని విధులు నిర్వర్తించినప్పటికీ, ఎంపీడీవో కార్యాల యాల చుట్టూ పలుమార్లు తిరిగినా చెల్లింపులు జరగలేదని తెలిపారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్గనైజర్ కొడెపాక భాస్కర్ అధికారులను కోరారు.

### అణగారిన వర్గాల అభ్యున్నతే
# ప్రభుత్వ లక్ష్యం

- సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



అక్షర దర్బార్, మహబూబాబాద్: రాష్ట్రంలోని అణగారిన వర్గాల అభివృద్ధి కోసం ఇందిరమ్మ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందని ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన ఇల్లందు రోడ్డులోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం 17వ డివిజన్ పరిధిలోని ఎస్సీ కాలనీని సందర్శించి ప్రభుత్వ గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం వినూత్న పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా యువతను ఉన్నత చదువుల కోసం విదేశాలకు పంపిస్తున్నామని, అలాగే చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తున్నా మని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కాలనీల్లో అంతర్గత రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, కార్పొరేషన్ అధికారులు శ్రీనివాస రావు, తహశీల్దార్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

### పది పరీక్షలకు
# ఏర్పాట్లు చేయాలి
### భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



అక్షర దర్బార్, జయశంకర్ భూపాల పల్లి ప్రతినిధి: 10వ తరగతి పబ్లిక్ పరీ క్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమ న్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశిం చారు. సోమవారం ఐడీఓసి కార్యాల యంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, వైద్య, రవాణా, విద్యుత్, ఆర్టీసీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16, 2026 వరకు ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడిం చారు. ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలని, ఫ్లైయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేసి 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. సమావే శంలో అదనపు కలెక్టర్లు, ఏఎస్పి, డీఈఓ, వైద్య, రవాణా, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రజావాణి అర్జీలను
# వెంటనే పరిష్కరించాలి

- అధికారులకు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశం
- మహబూబాబాద్ కలెక్టరేట్ లో 131 వినతుల స్వీకరణ



అక్షర దర్బార్, మహబూబాబాద్: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే వినతులను ప్రాధాన్యత క్రమంలో స్వీకరించి, నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి నిర్వహించిన ప్రజావాణిలో బాధితుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల సమస్యలను పరిష్కరించా లని, ముఖ్యంగా ధరణి, వారసత్వ మ్యుటేషన్లు, పింఛన్లు, రేషన్ కార్డుల అర్జీలను పెండింగ్‌లో ఉంచవద్దని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ పురుషోత్తం, సీపీఓ శ్రీనివాసరావు, డీహెచ్ఎస్ఓ మరియన్నతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తాడిచర్ల వాసికి ఓయూ డాక్టరేట్



అక్షర దర్బార్, మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన కామ రమ్య ఉస్మానియా యూనివర్సిటీ నుంచి భౌతిక శాస్త్రంలో పీహెచ్‌డీ (డాక్ట రేట్) పట్టా పొందారు. గ్రామానికి చెందిన కామ బాపు–సత్యవతి దంపతుల పెద్ద కుమార్తె రమ్య భౌతిక శాస్త్ర విభాగంలో "ఇన్వెస్టిగే షన్ ఆన్ ద ఎఫెక్ట్ ఆఫ్ అయానిక్ రేడియై అండ్ సైజ్ వేరియేషన్స్ పారామీ టర్ ఆన్ మాగ్నెటిక్, ఎలక్ట్రిక్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ బిహేవి యర్ ఆఫ్ లాంథనమ్ స్ట్రోంటియం మాంగనైట్స్" అనే అంశంపై పరిశోధన చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ వై. కళ్యాణలక్ష్మి పర్యవేక్షణలో ఆమె తన థీసిస్ సమర్పించారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి ఉన్నత శిఖ రాలను అధిరోహించిన రమ్యకు గ్రామస్తులు, మేధావులు అభినంద నలు తెలిపారు.

# నీళ్లు, నిధుల కోసమే తెలంగాణ తెచ్చుకున్నాం

### ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ బడే నాగజ్యోతి



అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: నీళ్లు, నిధుల సాధన కోసమే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నా మని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు జిల్లా పర్యటనలో భాగంగా దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును సందర్శించిన నేపథ్యంలో ఆమె సోమవారం మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటనల పేరుతో ప్రజాధనం వృథా చేస్తున్నారని, సీఎం పర్యటనలతో స్థానిక ప్రజలకు ఎలాంటి లాభం లేదని విమర్శించారు. సీఎం హోదాలో మూడుసార్లు దేవాదుల ప్రాజెక్టును సందర్శించినప్పటికీ అభివృద్ధి పనులు కనిపించడం లేదన్నారు. కేసీఆర్ హయాంలోనే ములుగు జిల్లా ఏర్పాటుతో పాటు అనేక అభివృద్ధి కార్య క్రమాలు జరిగాయని పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్టు పై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

### ఆ మండలాలకు సాగునీరందించాలి

గంగారం, కొత్తగూడెం మండలాలకు పాకాల వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజ్ నుంచి కాలువల ద్వారా లేదా లిఫ్ట్ ద్వారా ఏటూరునా గారం, మంగపేట, తాడ్వాయి మండలాలకు సాగునీరు అందించాలని కోరారు.

### కమీషన్ల కోసమే అంచనాల పెంపు

దేవాదుల ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.6వేల కోట్ల నుంచి రూ.18,500 కోట్లకు పెంచడం కమీషన్ల కోస మేనని ఆరోపించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము రమేష్ రెడ్డి, కుడుములు లక్ష్మీనా రాయణ ,లకవత్ నరసింహనాయక్, పట్టణ అధ్యక్షులు చెన్న విజయ్, ఆకుతోట చంద్రమౌళి ,మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్ రెడ్డి ,కోగిల మహేష్, కౌన్సిలర్లు బైకని సునీత ఓదెలు, గోనెల భారత్ ,కోగిల లక్మీ, బైకని అనూష సాగర్, మాజీ ఎంపీటీసీలు గొర్రె సమ్మయ్య, పోరిక విజయరాం నాయక్, మాచర్ల ప్రభా కర్, అజ్మీరా చందూలాల్ అనుముల సురేష్,మాజీ స ర్పంచ్ గండి కుమార్ సర్పంచులు బానోతు సీతారాం ఉప సర్పంచ్ అన్న తిరుపతి పార్టీ నాయకులు కాకి పురుషోత్తం గరిగ రఘు ముంజల బిక్షపతి చెదర సంతో ష్ చల్లగురువుల తిరుపతి,రవిరమన్న ఉన్నారు.



# కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్

- సహనాన్ని బలహీనతగా తీసుకోవద్దు
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

అక్షరదర్బార్, హనుమకొండ : బీఆర్ఎస్ కార్పొరేటర్ కాంగ్రెస్ కార్యకర్తపై చేసిన దాడిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. అధికారం కోల్పోయినా ప్రతిపక్ష నేతలు ఇంకా గుండాగిరి మానడం లేదని మండిపడ్డారు. సోమవారం ఈ ఘటనపై వరంగల్ సీపీని కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో తోట పవన్‌పై జరిగిన దాడి తరహాలోనే ఇది కూడా పథకం ప్రకారం జరిగిందని ఆరోపించారు. మా సహనాన్ని బలహీనతగా భావిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

**- వినయ్ భాస్కర్ పై విమర్శనాస్త్రాలు**

మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌ను లక్ష్యంగా చేసుకుని నాయిని తీవ్ర విమర్శలు చేశారు. భద్రకాళి ఆలయ పరిసరాల్లో గుడిసెలను తొలగించాలని గతంలో తీర్మానం చేసి, ఇప్పుడు అమ్మవారి పేరుతో రాజకీయాలు చేయడం విడ్డూరంగా ఉంది. సొంత లాభాల కోసం జిల్లాను ముక్కలు చేశారని, ప్రశాంతంగా ఉన్న నగరంలో అలజడి సృష్టించాలని చూస్తే పిడి యాక్ట్ నమోదు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు.

**- అభివృద్ధి మా నినాదం**

"పదేళ్లు అధికారంలో ఉండి కాలనీల సమస్యలు పట్టించుకోని వారు, ఇప్పుడు ప్రజా ప్రయోజనాలంటూ నాటకాలు ఆడుతున్నారని నాయిని మండిపడ్డారు. అభివృద్ధి మాత్రమే తమ సిద్ధాంతమని, కక్షపూరిత రాజకీయాలు తమ స్వభావం కాదని స్పష్టం చేశారు. కార్యకర్తల రక్షణ విషయంలో ఎలాంటి రాజీ పడబోమని, ఇకపై ఎవరి జోలికి వచ్చినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఎమ్మెల్యే హెచ్చరించారు.

# బికోట-వయాగోతో మొగి పురుగు నియంత్రణ

**బేయర్ క్షేత్ర ప్రదర్శనకు రిటైలర్ల స్పందన**



అక్షర దర్బార్, పరకాల: ఘనపురం మండలం గొల్లపల్లి గ్రామంలో బేయర్ కంపెనీ ఆధ్వర్యంలో వరి పంటలో బికోట, వయాగో మందుల వినియోగంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. బికోటను నాటిన 15 రోజుల దశలో, వయాగోను నాటిన 35 రోజుల దశలో వాడిన వరి పొలాన్ని రిటైలర్లు పరిశీలించారు. బికోట–వయాగో వినియోగంతో మోగి పురుగును దీర్ఘకాలం నియంత్రించవచ్చని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బేయర్ కంపెనీ మార్కెటింగ్ ఛాంపియన్ విక్రమ్ రెడ్డి, సి.సి.ఎం శివేష్ రెడ్డి, సూపర్వైజర్ శివసాయి, కంపెనీ ప్రతినిధులు కిరణ్, పరమేష్, వెంకటేష్, రమణారెడ్డి, తిరుపతి, ప్రసాద్, వినయ్, రాజశేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ పై కేబినెట్ కసరత్తు

- 28న పద్దు ప్రవేశపెట్టే అవకాశం
- సీఎం అధ్యక్షతన మంత్రి మండలి భేటీ
- రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేయాలని నిర్ణయం
- ప్రాదేశిక ఎన్నికలపై చర్చ జరిగినప్పటికీ.. ఏ నిర్ణయానికీ రాలేదు
- మే నుంచి జనగణన చేపట్టేందుకు సుదీర్ఘమైన చర్చ



**అక్షరదర్బార్, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ మంత్రిమండలి సుదీర్ఘంగా సమావేశమైంది. ఈ భేటీలో ప్రధానంగా ఈ నెల 28న శాసనసభలో ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్ పద్దుపై మంత్రులు విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రాబడుల అంచనాలను బేరీజు వేస్తూ బడ్జెట్ ప్రతిపాదనలకు తుది రూపం ఇచ్చే దిశగా కసరత్తు చేశారు. మార్చి మొదటి వారంలోనే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించి సభ ఆమోదం పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. మహాలక్ష్మి పథకం, రైతు భరోసా వంటి కీలక పథకాలకు నిధుల కేటాయింపుపై ప్రాధాన్యత ఇచ్చారు. త్వరలో రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. రాష్ట్రంలో 2027 జనగణన చేపట్టేందుకు జరుగుతున్న ఏర్పాట్లపై మంత్రివర్గం ప్రత్యేకంగా సమీక్షించింది. తొలి విడత జనగణన ప్రక్రియను మే 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ కోసం కేంద్రం నిర్దేశించిన 34 ప్రశ్నల నమూనాను అధికారులు కేబినెట్‌కు వివరించారు. జనగణన విధుల్లో సుమారు 89 వేల మంది ఉద్యోగులు పాలుపంచుకోనున్నారు. రెండో దశ గణన ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది. కేంద్ర షెడ్యూల్ ప్రకారం ఈ పనులన్నీ సజావుగా సాగేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

**- ప్రాదేశిక ఎన్నికలపైనా చర్చ**

ప్రాదేశిక ఎన్నికల నిర్వహణపై కూడా మంత్రిమండలిలో లోతైన చర్చ జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై సమాలోచనలు చేశారు. అయితే ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఇప్పట్లో ప్రాదేశిక ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. విద్యా, పోలీస్ శాఖల అధికారులు పరీక్షల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరపాలని సర్కారు భావిస్తోంది. రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఎన్నికల గంట మోగనుందని సమాచారం. హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ సంస్థ నుంచి స్వాధీనం చేసుకునే ప్రక్రియపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 31లోగా ఈ టేకోవర్ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మెట్రోకు సంబంధించిన రూ.10 వేల కోట్ల రుణాలను రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. దీనివల్ల మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్రం నుంచి అనుమతులు సులభంగా వస్తాయని ఆశిస్తున్నారు. మూసీ పునరుజ్జీవనం వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల పురోగతిపై కూడా ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిల చెల్లింపుపై సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఉద్యోగుల హెల్త్ కేర్ ట్రస్ట్‌కు కేబినెట్ ఆమోదముద్ర వేయనుంది. యంగ్ ఇండియా స్కూళ్లు, డీసీసీబీ భవన నిర్మాణాలకు అవసరమైన భూముల కేటాయింపుపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

# రోడ్డు ప్రమాదాలతో యువతను కోల్పోతున్నాం

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- వాగ్దేవిలో 'అరైవ్ అలైవ్'



అక్షరదర్బార్, హనుమకొండ: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ఎంతో మంది యువత రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడటం బాధాకరమని, ఇది దేశ భవిష్యత్తుకు తీరని లోటని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెల చివరి వారంలో నిర్వహించే "అరైవ్ అలైవ్" రెండో విడత కార్యక్రమంలో భాగంగా, సోమవారం హన్మకొండలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కీలక సూచనలు చేశారు. ప్రతి వాహనదారుడు తన ప్రాణాన్ని కాపాడుకుంటూనే, ఇతరుల ప్రాణాలకు ముప్పు కలగకుండా బాధ్యతగా వ్యవహరించాలి. కేవలం థ్రిల్ కోసం మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరం. ప్రతి ఒక్కరూ సురక్షితమైన 'డిఫెన్సివ్ డ్రైవింగ్' పద్ధతులను అలవాటు చేసుకోవాలని అన్నారు.

**- హత్యల కంటే..**

గణాంకాలను వివరిస్తూ సీపీ సంచలన విషయాలను వెల్లడించారు. "గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా హత్యలు లేదా ఇతర కారణాలతో సుమారు 800 మంది మరణించగా, రోడ్డు ప్రమాదాల వల్ల ఏకంగా 7,500 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది చాలా కలవరపరిచే విషయం" అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు తాము నిబంధనలు పాటించడమే కాకుండా, తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కూడా ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని కోరారు.

**- ప్రతిజ్ఞ చేసిన విద్యార్థులు**

సదస్సు ప్రారంభంలో ట్రాఫిక్ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నిబంధనలు ఉల్లంఘిస్తే జరిగే పరిణామాలను విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు వివరించారు. అనంతరం, ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటిస్తామంటూ విద్యార్థులందరితో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ డీసీపీ దార కవిత, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, ఇన్స్పెక్టర్లు వెంకన్న, సీతరెడ్డి, సుజాత, వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ శేషాచలం, కరస్పాడెంట్లు శ్రవణ్ రెడ్డి, హరిచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు హైకోర్టు శుభవార్త

- 8 వారాల్లోగా స్థలాలు కేటాయించాలని ఆదేశం
- నెలకు రూ.25 వేల పెన్షన్ ఇవ్వాల్సిందేనని స్పష్టీకరణ
- హామీల అమలుపై నిర్లక్ష్యం వహించవద్దని ప్రభుత్వానికి హెచ్చరిక

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు సంబంధించి హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అభయహస్తం పథకం కింద ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తామని ప్రకటించింది. ప్రతి ఉద్యమకారుడికి 250 చదరపు గజాల ఇళ్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చింది. నెలకు రూ.25 వేల పెన్షన్ అందిస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ హామీలు అమలు కావడం లేదని ఉద్యమకారులు కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ బి విజయసేన్ రెడ్డి ధర్మాసనం ఈ పిటిషన్లపై సోమవారం సమగ్ర విచారణ చేపట్టింది. అర్హులైన ఉద్యమకారులను గుర్తించి ఎనిమిది వారాల్లోగా ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోర్టు ఆదేశించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నెలవారీ పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. హామీల అమలులో జరుగుతున్న ఆలస్యంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. కొందరికి మాత్రమే ప్రయోజనాలు అందిస్తే అందుకు పాటించిన ప్రమాణాలు ఏమిటో వివరించాలని కోరింది. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుందని కోర్టు వ్యాఖ్యానించింది. హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు తెలంగాణ ఉద్యమకారుల్లో కొత్త ఆశలు రేకెత్తించాయి. ఇళ్ల స్థలం, పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న వేలాది మందికి ఇది పెద్ద ఊరటగా మారింది. కోర్టు గడువు విధించడంతో ప్రభుత్వం ఇప్పుడు విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. తక్షణమే జీవో జారీ చేసి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని ఉద్యమకారులు కోరుతున్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915